
www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శుక్రవారం
04 ఏప్రిల్ 2025

## విలేఖరులు కావలెను

కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రెజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రెయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003




# వక్ఫ్ బిల్లు పాస్

## సవరణ బిల్లును ఆమోదించిన రాజ్యసభ

- ఎగువ సభలో బిల్లుకు అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు
- అర్ధరాత్రి దాటేవరకూ సభలో విస్తృత చర్చ



న్యూ ఢిల్లీ : పార్లమెంట్ వక్ఫ్ (సవరణ) బిల్లు 2025 ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. రాజ్యసభ గురువారం అర్ధరాత్రి ఎగువ సభ బిల్లుకు ఆమోదం తెలిపింది. సభలో ఓటింగ్ నిర్వహించగా.. బిల్లుకు అనుకూలంగా 128 మంది సభ్యులు ఓటు వేయగా, 95 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే, బిల్లుపై రాజ్యసభ దాదాపు 12 గంటల పాటు సుదీర్ఘగా చర్చ కొనసాగింది. మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వక్ఫ్ బిల్లుపై చర్చను ప్రారంభిస్తూ.. బిల్లు ముస్లిం ప్రయోజనాలకు హాని కలిగిస్తుందనే ఆరోపణలను కొట్టిపడేశారు. వక్ఫ్ బోర్డు నిర్వహణ, సృష్టి, లబ్ధిదారులంతా ముస్లింలే ఉంటారని, ముస్లిమేతరులు దాని వ్యవహారాల్లో జోక్యం ఉండదన్నారు. ఈ బిల్లు మతానికి సంబంధించింది కాదని.. ఆస్తుల నిర్వహణకు సంబంధించినదని, అవినీతిని నిర్మూలించడమే బిల్లును తీసుకొచ్చామన్నారు. అయితే, వక్ఫ్ సవరణ బిల్లు2025 వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం లక్ష్యం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. వారసత్వ ప్రదేశాలను కాపాడేందుకు, సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ వక్ఫ్ చట్టంలో సవరణలు చేసింది. ఆస్తి నిర్వహణలో పారదర్శకత, వక్ఫ్ బోర్డులు, స్థానిక అధికారుల మధ్య సమన్వయం క్రమబద్ధీకరణ, వాటాదారుల హక్కుల రక్షణ ఈ చట్టం లక్ష్యం. ముస్లిం మహిళలు, ముఖ్యంగా వితంతువులు, విడాకులు తీసుకున్న మహిళల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపర్చడం, మెరుగైన వక్ఫ్ పాలన వివిధ ముస్లిం వర్గాల నుంచి ప్రాతినిధ్యం, వక్ఫ్ బోర్డును కలుపుకొనిపోయేలా చేయడానికి ఈ బిల్లు ఉద్దేశించబడింది. వక్ఫ్ (సవరణ) బిల్లు వక్ఫ్ పరిపాలన కోసం లౌకిక, పారదర్శక, జవాబుదారీ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఈ బిల్లు భారతదేశంలో వక్ఫ్ పరిపాలన కోసం ప్రగతిశీల, న్యాయమైన చట్టాన్ని నిర్దేశిస్తుంది. కాగా, వక్ఫ్ సవరణ బిల్లు 2025 లోక్‌సభలోనూ ఆమోదం పొందింది. సభలో ఓటింగ్ నిర్వహించగా బిల్లుకు అనుకూలంగా 282 మంది సభ్యులు ఓటు వేయగా.. 232 మంది వ్యతిరేకించిన విషయం తెలిసిందే. 12 గంటల పాటు సాగిన సుదీర్ఘ చర్చ అనంతరం బుధవారం అర్ధరాత్రి లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందింది. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు రాష్ట్రపతికి వద్దకు వెళ్లి చట్టంగా మారనుంది.



# తక్షణమే పనులు ఆపండి

2లో


- కంచె గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వ తీరుపై సుప్రీం ఆగ్రహం
- మూడు రోజుల్లో 100 ఎకరాల్లో చెట్ల నరికివేత చిన్న విషయం కాదు
- చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారు
- ప్రశ్నించిన జస్టిస్ గవాయి
- చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా?
- న్యాయమూర్తి తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఒక్క చెట్టూ కూల్చొద్దు
- సుమోటోగా కేసు నమోదు
- ఈ నెల 16 వరకు కేసు వాయిదా



2లో

# రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు




3లో

# అకాల వర్షం.. అతలాకుతలం

## జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిని విస్తరించాలి

### మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ

**కలంజ్యోతి, జగిత్యాల** :జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కి జగిత్యాల పట్టణ 35 వ వార్డు మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ లేఖ రాశారు. జగిత్యాల నుంచి కరీంనగర్ నేషనల్ హైవే 563 నాలుగు లైన్ల రహదారి గురించి జగిత్యాల పట్టణ, కరీంనగర్ పట్టణాన్ని కలుపుతూ ఉన్న అన్ని మండలాల ప్రజలు, గ్రామాల ప్రజల దశాబ్దాల కలను సాకారం చేయాలన్నారు. జగిత్యాల-కరీంనగర్ రోడ్డు అవసరాన్ని గుర్తించి వంద రోజుల లోపు పనులు మొదలు పెడతామని చెప్పిన ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. జగిత్యాల-కరీంనగర్ రోడ్డుకు ఇప్పటి వరకు పూర్తిస్థాయి భూసేకరణ కాలేదన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు టెండర్లు పిలిచి, వాటిని రద్దు చేశారని పేర్కొన్నారు. వేలాది వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో నిత్యం ఒక రోడ్డు ప్రమాదం జరుగుతూ కొన్ని వందల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణ బాధ్యతగా తీసుకోవాలని ప్రజలందరి పక్షాన కోరుతున్నానని తెలిపిన జయశ్రీ అన్నారు.




## ముగ్గురుపై వేటు!

### మెడికల్ కాలేజీలో గత నెల 26న జూనియర్ విద్యార్థిపై ముగ్గురు సీనియర్లు ర్యాగింగ్

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ మెడికల్ కాలేజీలో గత నెల 26న జూనియర్ విద్యార్థిపై ముగ్గురు సీనియర్లు ర్యాగింగ్ చేశారు. ఫస్ట్ ఇయర్ చదువుతున్న దీపక్ శర్మను సీనియర్లు రూమ్ కు పిలిచి ర్యాగింగ్ చేశారు. కళాశాలలో యాంటి ర్యాగింగ్ కమిటీ విద్యార్థుల వారి తల్లిదండ్రులతో కలిసి భేటీ అయ్యారు. ర్యాగింగ్ చేసినట్లు నిర్ధారణ కావడంతో లోకేష్ కు 3 నెలలు, హర్షవర్ధన్ 2 నెలలు, హిమవర్ధన్ నెల పాటు కాలేజీ హాస్టల్ నుంచి వేటు వేశారు.





## హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మెరుగు రమేష్

**కలంజ్యోతి, గీసుకొండ :** మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన మెరుగు రమేష్ వైద్యవృత్తిలో సుపరిచితులు. వ్యాపారవేత్తగా ఎదుగుతున్న సమయంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన మెరుగు రమేష్ ని కేపీ రాజు, ముదిగొండ శ్రీనివాస్, కామని నాగరాజు, రమేష్ వర్మ, శివ, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

# తక్షణమే పనులు ఆపండి

## కంచె గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వ తీరుపై సుప్రీం ఆగ్రహం



**కలంజ్యోతి, హైదరాబాద్ :** కంచ గచ్చిబౌలిలోని భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ తీ రుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇ చ్చేంత వరకు అన్ని రకాల చర్యలు నిలిపివేయాల ని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గ చ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మా సనం.. ఆ భూముల్లో ఎలాంటి పను లు చేపట్టొదంటూ స్టే విధించింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యంతర నివేదికను పంపారు. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన నివేదికలోని ఫొటోలు చూసి అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పింది. వందల కొద్దీ యంత్రాలు మోహరించాల్సిన అగత్యం ఏంటో అర్థం కావడం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను అమికస్ క్యూరీ.. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేసింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని అత్యున్నత న్యాయస్థానం ప్రతివాదిగా చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా, చెట్లు కొట్టే ముందు సిఇసి అనుమతి తీసుకున్నారా..? అని నిలదీసింది. ఒక్క రోజులో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని తెలిపింది. తమ ప్రశ్నలకు సిఎస్ సమాధానం చెప్పాలని సుప్రీం ఆదేశించింది. 30 ఏళ్లుగా ఆ భూమి వివాదంలో ఉందని సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొవచ్చారు. అటవీ భూమి (ఫారెస్ట్ ల్యాండ్) అని ఆధారాలు లేవని న్యాయస్థానానికి తెలిపారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వడం లేదని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది.

**16కు వాయిదా :** కంచ గచ్చిబౌలిలోని భూముల వ్యవహారంలో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ప్రభుత్వం మార్చి 15న వేసిన కమిటీలోని అధికారులు కూడా జవాబు చెప్పాలని ఆదేశించింది. ఉల్లంఘనలు జరిగితే సిఎస్ వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలుపుతూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

**హైకోర్టులోనూ విచారణ :** మరోవైపు కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సియు విద్యార్థులు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో గురువారం కూడా విచారణ జరిగింది. బుధవారం రోజున ఒకరోజు పనులు ఆపాలని ఆదేశించిన ధర్మాసనం ఈనెల 7 వరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని ఆదేశించింది.

**హెచ్‌సీయూలో కలియ తిరిగిన హైకోర్టు రిజిస్ట్రార్**

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గురువారం ఉదయం హైకోర్టు రిజిస్ట్రార్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూములను పరిశీలించారు. దాదాపుగా ఐదు కిలోమీటర్ల కాలినడకన పర్యటించి వివరాలు సేకరించారు. దాదాపు నాలుగైదు గంటల పాటు రిజిస్ట్రార్ హెచ్‌సియు భూములకు సంబంధించిన వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు రిజిస్ట్రార్‌ను కలిసి వర్సిటీలో ధ్వంసమైన భూమిని చూపించారు. అన్ని వివరాలు సేకరించి విశ్లేషించి హైకోర్టు రిజిస్ట్రార్ నివేదిక రూపొందించి సుప్రీంకోర్టుకు సమర్పించారు. మధ్యాహ్నం రిజిస్ట్రార్ యూనివర్సిటీ నుండి తిరిగి వెళ్లగానే పోలీసులు ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టి ఎవ్వరిని వెళ్లకుండా అడ్డుకున్నారు.

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

### నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



**కలంజ్యోతి, నిర్మల్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నదని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షించు కుందామని ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత దేశంలోని ప్రతి వ్యక్తిపై ఉందన్నారు. ప్రజలను జాగృతం చేసేందుకు ప్రతి గ్రామం, వార్డులో ఈ కార్యక్రమాన్ని తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడునాందేడపు చిన్ను, ఖానాపూర్ నియోజకవర్గ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఇన్ ఛార్జ్ రామ్ భూపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేష్, నిర్మల్ కార్యక్రమ ఇన్ ఛార్జ్ రాజురా సత్యం, సేవాదళ్ రాష్ట్ర నాయకులు ఎంబడి రాజేశ్వర్, కౌన్సిలర్లు నల్లూరి పోశెట్టి, దర్శనం సాయన్న, నేరెళ్ల వేణు,ఎస్పీ రాజు, సాయిండ్ల శ్రీధర్,కత్తి నరేందర్, గంగోని బురాజ్, కొండ శ్రీనివాస్, గంగోని భూరాజ్, వాజీద్ ఖాన్, జునైద్ మెమన్, అర్షద్, చిరంజీవి, నర్సారెడ్డి, నరేందర్, ఎంబడి రాకేష్, కలీం, నాయకులు గాజుల రవికుమార్, గడ్డింటి ప్రశాంత్, గుల్లె రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. అతలాకుతలం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్రంలో అకాల వర్షంతో పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. కొన్నిచోట్ల భారీ వర్షం కురియగా.. చాలా చోట్ల మోస్తరు వానలు పడ్డాయి. పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలకు వరిపంట నేలకొరగ్గా.. మామిడి, జొన్న, మొక్కజొన్నతో పాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థాన్‌నారాయణపురంలో అత్యధికంగా 9.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ ఈదురుగాలులకు భువనగిరిరాయగిరి రోడ్డులోని మాస్‌కుంట వద్ద చెట్లు కూలి రోడ్డు మధ్యలో పడిపోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట మండలాల్లో వడగండ్ల వర్షానికి మామిడికాయలు నేలరాలాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ధర్పల్లి మండలంలో గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోయాయి. కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, నస్రుల్లాబాద్ తదితర ప్రాంతాల్లో వడగండ్ల వర్షాలు కురువడంతో మొక్కజొన్న, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, పిట్లం, సదాశివనగర్, కామారెడ్డి, రామారెడ్డి మండలాల్లో ఈదురుగాలులకు వరి పంట నేలకొరిగింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో లోతట్టు కాలనీలు జలమయంగా మారాయి. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ మార్కెట్ యార్డులో మక్కలు, పొద్దు తిరుగుడు గింజలు తడిసిముద్దయ్యాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు కొత్తవాడలో చామగడ్డ పంట నీటమునిగింది. జిల్లాలో అనేక చోట్ల కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో విద్యుత్తు స్తంభాలు నేల కూలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ములుగు జిల్లాలో వానకు తోడు గాలులు వీయడంతో మామిడి తోటలకు స్వల్ప నష్టం జరిగింది. అక్కడక్కడ కోతకు సిద్ధమైన మిర్చి పంట తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.





**పిడుగులు పడి నలుగురి మృతి**

వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు నలుగురు మృతి చెందగా.. గోడ కూలి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. నాగర్‌కర్నూలు జిల్లా పదర మండల కేంద్రం శివారులోని కోడొనిపల్లికి చెందిన సుంకరి సైదమ్మ(35), వీరమ్మ(55)లు వేరుశనగ పంట పొలంలో కూలీ పనులకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో భారీ వర్షంతో పాటు పిడుగు పడటంతో అక్కడికక్కడే ఆ ఇద్దరు మృతి చెందారు. మరో కూలీ సుంకరి లక్ష్మమ్మకు తీవ్ర గాయాలు కావడంతో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గద్వాల జిల్లా మానవపాడు మండలం చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన బోయ వెంకటేశ్వర్లు (40) పశువులు మేపేందుకు వెళ్లి పొలం వద్ద పిడుగుపాటుకు గురై మరణించాడు. అదే జిల్లా వడ్డేపల్లి మండలం బుడవరుసులో పశువులకు మేత వేసేందుకు వెళ్లిన హరిజన మహేంద్ర (20) కూడా పిడుగుపాటుకు బలయ్యాడు. సిద్దిపేట జిల్లా గజ్వే ల్ మండలం జాలిగామలో గోడ కూ లి ఒకరు మరణించగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కొడంగల్ మండ లం ఖాజా అహ్మద్‌పల్లిలో రైతు ఫకీరప్ప 30 గొర్రె లు, మేకలు పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి.

**హైదరాబాద్‌లో గంటన్నర పాటు వాన..**

ఇటు హైదరాబాద్‌లో దాదాపు గంటన్నర పాటు వాన దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరి జనం అవస్థలు పడ్డారు. రోడ్లపై కి.మీ. మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరూర్‌నగర్, హిమాయత్‌నగర్, డబీర్‌పురాలో 8.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మలక్‌పేట రోడ్ అండర్ బ్రిడ్జి కింద వరదలో ఆర్టీసీ బస్సు ఆగిపోవడంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు బస్సు టాప్‌పైకి ఎక్కారు. ఇటు సరూర్‌నగర్ వద్ద మూసీ నదిలోని శివాలయానికి వెళ్లిన ఇద్దరు అక్కడే చిక్కుకున్నారు. అధికారులు స్పందించి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. బౌద్ధనగర్, హబ్సీగూడ, ఖైరతాబాద్ ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. మింట్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ ముద్రణాలయంలోకి భారీగా వర్షపు నీరు చేరింది. సోమాజిగూడ రవాణా శాఖ కార్యాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడగా.. దాన్ని తొలగించారు. వర్షం ధాటికి చారిత్రక చార్మినార్ కట్టడంలో భాగ్యలక్ష్మి ఆలయం వైపున్న ఓ మినార్ పెచ్చులూడి కిందపడ్డాయి. అయితే సుందరీకరణ నేపథ్యంలో మినార్‌పై వేసిన ప్లాస్టర్ మాత్రమే ఊడిందని.. మరమ్మతులు కొనసాగుతున్నాయని అధికారులు వివరణ ఇచ్చారు. ఇక గ్రేటర్ వ్యాప్తంగా చెట్లు కూలాయని 28, వరద నీరు నిలిచిందని 48 ఫిర్యాదులు వచ్చాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. 23 గంటల్లోనే వాటిని పరిష్కరించామని వెల్లడించారు.

**అప్రమత్తంగా ఉండాలి : సీఎం ఆదేశం**

హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈదురుగాలులు, వడగండ్ల వానలు పడుతున్నందున జిల్లాల కలెక్టర్లు, పోలీసులు అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. వర్షాలు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిల్వకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు, విద్యుత్తు అంతరాయాలు లేకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.







## మాదిగ జేఏసీ మండల కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా మంద చిన్ను

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, రాష్ట్ర అధ్యక్షులు బొల్లికొండ వీరేందర్, కొడారి వినాయకరావు ఆదేశాల మేరకు నర్సంపేట నియోజకవర్గం ఇన్చార్జి నర్మెట యాదగిరి, నర్సంపేట నియోజకవర్గ ఉపాధ్యక్షులు కొయ్యల భాస్కర్, మంద విజయ్ ఆధ్వర్యంలో మాదిగ జేఏసీ చెన్నారావుపేట నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద చిన్ను, ఉపాధ్యక్షులుగా ములుగురి స్వామి, సహాయ కార్యదర్శిగా ఎర్ర సాగర్, అర్కాల రాజేందర్, ఉపాధ్యక్షులుగా జన్ను నరేష్, కార్యదర్శిగా తుమ్మలపల్లి అనిల్, కోశాధికారిగా బుర్రి అశోక్ , గౌరవ అధ్యక్షులుగా ఇసంపెల్లి ఐలయ్య, ముఖ్య సలహాదారులుగా కన్నం సత్య, పుటికల ప్రభాకర్ ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చింతల రాములు, వడ్లకొండ సంజీవ, సింగారపు విజయ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## భూముల జోలికి రావొద్దు

### ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



**కలంజ్యోతి, ఆందోల్ :** సెంట్రల్ యూనివర్సిటీ భూముల్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెటట్టే నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వెనుక్కి తీసుకోవాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ జనరల్ సెక్రటరీ చంటి క్రాంతికిరణ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూమి పరిరక్షణ కోసం విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ భూమిని కాపాడుకోవడానికి విద్యార్థులు పోరాటం చేస్తుంటే, ప్రభుత్వం పోలీసు బలగాలతో వారిపై లాఠీచార్జి చేసి చితకబాదడాన్ని తీవ్రంగా ఖండించారు. అందరం కూడా సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు అండగా ఉండి, యూనివర్సిటీ భూములను కాపాడుకుందామని యువతకు పిలుపునిచ్చారు.



## ఘనంగా వెంకన్నస్వామి కల్యాణం



**కలంజ్యోతి, నర్సాపూర్ :** హత్నూర మండలం నవాపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం 25వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా గురువారం రెండవ రోజున కల్యాణోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు వేద పండితుల మంత్రోత్సవాల మధ్యన లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పఠనం, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపు పల్లకి సేవ నిర్వహించారు.

# పోరాట స్ఫూర్తికి దొడ్డి కొమరయ్య ఆదర్శం

## అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



**కలంజ్యోతి, నిర్మల్ :** దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువలేనిదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ కొనియాడారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి అదనపు కలెక్టర్, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య ముఖ్య భూమిక పోషించారన్నారు. ఇలాంటి త్యాగధనులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. బడుగు బలహీన వర్గాల హక్కులను కాపాడడం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, సీపీఓ జీవరత్నం, పలు కుల సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

**కలంజ్యోతి, జగిత్యాల :** జగిత్యాల పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆ ధ్వర్యంలో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. అనంతరం దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా, సాంస్కృతిక కార్యదర్శి, బొమ్మిడి నరేష్‌కుమార్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల వంశీ, నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కోఆర్డినేటర్ హృషికేష్, బండపెల్లి నర్సయ్య, బీసీ నాయకులు పాల్గొన్నారు.



# కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శం

## మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి




**కలంజ్యోతి, జగిత్యాల :** దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాటంలో పాల్గొని అప్పటి పెట్టుబడి దారుల వర్గాలకు భూస్వామి వర్గాలకు వ్యతిరేకంగా రైతు కూలీలతో సంఘటితంగా ఉద్యమాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లినటువంటి గొప్ప నాయకుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో చెట్టే గంగాధర్, చెట్టే భార్గవ్, మహేందర్, రెడ్డి, గంగమల్లు, కొమురయ్య, మల్లారెడ్డి, మహేష్, అజయ్, జగిత్యాల జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, సేవాదల్ విభాగం ముఖేష్ కన్నా, అభి, ప్రకాష్, సందీప్,నా యకులు పాల్గొన్నారు.

# కొమరయ్య ఆశయాలను సాధిస్తాం

## మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి



**కలంజ్యోతి, జగిత్యాల :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయాలను సాధిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. గురువారం జ్యోతి ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నైజాం సర్కారుకు వ్యతిరేకంగా విరోచితంగా పోరాడిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అన్నారు. నేటి సమాజానికి దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.



# పోరాట యోధుడు కొమురయ్య

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**కలంజ్యోతి, ఆందోల్ :** భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి అమరుడైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కురుమ, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శం

## అదనపు కలెక్టర్ బీఎస్ లత

**కలంజ్యోతి, జగిత్యాల :** దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి అదనపు కలెక్టర్ బీఎస్ లత పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సునీత, బీసీ, ఎస్సీ సంఘ అధ్యక్షులు, జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**కలంజ్యోతి, మంచిర్యాల :** నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతి లాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, కుల సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కుల సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కలంజ్యోతి 5
శుక్రవారం 04.04.2025 General News

# పేదలకు సన్నబియ్యం పంపిణీ
# కాంగ్రెస్ పార్టీ ఘనత

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


### జోగిపేట గంజి మైదానంలో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన మంత్రి



**కలంజ్యోతి, ఆందోల్ :** సంపన్నులు తినే సన్నరకం బియ్యాన్ని చౌకధరల దుకాణాల ద్వారా రాష్ట్రంలోని నిరుపేద ప్రజలందరికీ పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట గంజి మైదానంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చౌక ధరల దుకాణాల ద్వారా నాసిరకం బియ్యం సరఫరా జరిగేదన్నారు. ఆ బియ్యాన్ని ప్రజలు ఎవరూ తినే వారు కాదన్నారు. దీంతో నాసిరకం బియ్యం రీసైక్లింగ్ జరిగిందని ప్రాంతాలకు అమ్ముకునే వారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సన్నధాన్యానికి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇవ్వడంతో పాటు రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుల వద్ద సన్న వడ్లకు క్వింటాల్ కు రూ. 500 బోనస్ చెల్లించి సేకరించిందన్నారు. సేకరించిన ధాన్యాన్ని చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే పథకాన్ని ఉగాది రోజున సీఎం ప్రారం భించినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 846 చౌక ధరల దుకాణాల ద్వారా 78,728 తెల్ల రేషన్ కార్డులు, 26,115 అంత్యోదయ కార్డులు, 100 అన్నపూర్ణ కార్డుల ద్వారా ప్రతినెల 12,32,274 లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లాలో నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని పౌష్టికాలతో కూడిన సన్నబియ్యం తిని ఆరోగ్యవంతంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతం కోసం రేషన్ డీలర్లు పౌరసరఫరాల రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి సన్నబియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. ఈ బియ్యం పంపిణీ వల్ల నిరుపేద ప్రజలకు అందడంతో పాటు రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్ మోహన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ డీఎం రాజేశ్వర్ అంబదాస్, ఆర్డీవో పాండు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, చిట్టిబాబు, రంగ సురేష్, పిట్ల లక్ష్మణ్, డీజే వెంకటేశం పాల్గొన్నారు.

## 8వ రోజుకు మార్క సురేష్ పాదయాత్ర

### యాత్రకు సంఘీభావం తెలిపిన పలువురు సగర నాయకులు



**కలంజ్యోతి, హన్మకొండ :** శ్రీరామనవమి సందర్భంగా రాముడి కల్యాణం కోసం పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర యువజన సగర సంఘం అధ్యక్షుడు మర్క సురేష్ సగర భాగ్యనగరం నుండి భద్రాచలం వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. కాగా ఈ యాత్ర 250 కిలో మీటర్లు పూర్తి చేసుకుని ఖమ్మ జిల్లాలోని ఏన్కూరు చేరింది. ఈ పాదయాత్రకు సంఘీభావంగా తెలంగాణ రాష్ట్ర సగర సంఘం రాష్ట్ర కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర రూ.5,016, కరీంనగర్ జిల్లా సగర సంఘం ప్రధాన కార్యదర్శి కట్ట రాజు సగర రూ.1,116 సురేష్ సగరకు అందజేశారు. ధృడ సంకల్పంతో అపర భగీరథ ప్రయత్నం చేస్తూ శ్రీరాముని వారసులం తామేనని నిరూపించేందుకు ఈ యాత్ర చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. సురేష్ చేపట్టిన యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని కోరారు.

### ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై

## ప్రత్యేక దృష్టి సారించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**కలంజ్యోతి, మంచిర్యాల :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తో కలిసి జిల్లా అధికారులతో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంతో పాటు రాష్ట్రస్థాయిలో జిల్లాకు సంబంధించి వస్తున్న దరఖాస్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మల్యాలలో సన్నబియ్యం పంపిణీ

**కలంజ్యోతి, మల్యాల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు శనిగరపు తిరుపతి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కోరేపు వెంకటేష్, ఏఎంసీ ముదాం మల్లేశం, మొహమ్మద్ ఇమామ్, వీరబత్తిని ప్రసాద్, గడి అనిల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు సన్నబియ్యం ఓ వరం

**కలంజ్యోతి, గీసుకొండ :** మండలం గంగదేవిపల్లిలో కాంగ్రెస్ గీసుగొండ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కూస రమేష్, గ్రామ అధ్యక్షులు నవీన్, యూత్ అధ్యక్షులు నేల రాజు, ప్రశాంత్, గోనె నాగరాజు, వీఓ అధ్యక్షురాలు నీలం శివక్క తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జక్కుల జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి



**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దుండిగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ జన్మదిన సందర్భంగా మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ మీ ప్రేమ అభిమానాలు తనపై ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం రుణాలను సకాలంలో పంపిణీ చేయాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రాజీవ్ యువ వికాసం పై బ్యాంకర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువ వికాసం అమలుకు ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యం మేరకు రుణాలను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం కింద మంజూరు చేసే యూనిట్లకు మున్సిపాలిటీ, మండలాల పరిధిలో ఉన్న బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించడం జరుగుతుందన్నారు. సబ్సిడీ మంజూరైన యూనిట్లకు తప్పనిసరిగా బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేసి యూనిట్ గ్రౌండింగ్ లో బ్యాంకులు తమ సహకారం అందించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన, తుది ఆమోదం సమయంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సైతం హాజరు కావాలన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతి, యువకులకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం రాజీవ్ యువవికాసం పథకం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ పథకం కింద ఓబీఎంఎస్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్, యూబీఐ బ్యాంక్ రీజినల్ హెడ్ అపర్ణ




రెడ్డి, ఎస్బీఐ రీజినల్ మేనేజర్ వెంకటేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, వివిధ బ్యాంక్ కంట్రోలర్స్, బ్యాంక్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువవికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కలంజ్యోతి, మంచిర్యాల :** ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని జిల్లాలోని జిల్లాలోని మైనారిటీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు ఉన్న దరఖాస్తు గడువును ఈనెల 14వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు సమర్పించడంలో ఏదైనా సమస్యలు తలెత్తినట్లయితే మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయంలో ఆఫ్ లైన్ దరఖాస్తు ఫారం ను పొంది సమర్పించవచ్చని తెలిపారు. ఒక రేషన్ కార్డులో ఉన్న ఒకే లబ్ధిదారునికి ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. వ్యవసాయేతర కార్మికుల అర్హత వయసు జూలై 2025 నాటికి 21 నుండి 55 సంవత్సరాలు, ఇతర రంగాలకు చెందిన వారి వయోపరిమితి 21 నుండి 60 సంవత్సరాలు ఉండాలని, గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. 50 వేల వరకు ఉన్న మొత్తాలపై 100 శాతం రాయితీ, 1 లక్ష రూపాయల వరకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం, 2 లక్షల రూపాయల వరకు 80 శాతం రాయితీ, 20 శాతం బ్యాంకు రుణం, 4 లక్షల రూపాయల వరకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు / ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం (క్రైస్తవులు అయితే బాపిస్ట్ సర్టిఫికెట్/బి. సి. సి, ముస్లిం, సిక్కులు, జైన్, పార్సి, బౌద్ధులు తమ మత పెద్దల ద్వారా జారీ చేసిన ధ్రువపత్రం), డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు సమర్పించాలని తెలిపారు. ఆన్ లైన్ లో సమర్పించిన దరఖాస్తు ప్రతిని సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి/మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఆన్ లైన్ లో tgobmms.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తులు సమర్పించవచ్చని, ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# పీఏసీఎస్ ద్వారా సమర్థవంతమైన కార్యకలాపాలు

## కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా సమర్థవంతమైన కార్యకలాపాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తో కలిసి జిల్లా అధికారులు, నూతనంగా ఏర్పాటు అయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పునర్వ్యవస్థీకరించడం జరిగిందని, నూతనంగా ఏర్పడిన సంఘాల సమన్వయంతో సమర్థవంతమైన కార్యకలాపాలు నిర్వహించాలని తెలిపారు. గోదాముల నిర్వహణ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల నిర్వహణ, ఇతర సంఘ విధులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వ హణ అధికారి గణపతి, జిల్లా సహకార అధికారి మోహన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

### కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** మాతా, శిశు మరణాలు నియంత్రించడమే అమ్మ రక్షిత కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మరక్షిత కార్యక్రమం అమలు తీరుపై వైద్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదు చేసుకున్న గర్భిణులకు సంబధించిన వివరాలు, వారిలోని ప్రమాదకర ఆరోగ్య స్థితి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గర్భస్థ మహిళల మరణాలు తగ్గించేందుకు ప్రత్యేకంగా అమ్మరక్షిత కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రమాదకర ఆరోగ్య స్థితిని కలిగియున్న గర్భిణులకు తగిన మందులను ఇవ్వాలన్నారు. అంగన్వాడీల ద్వారా గర్భిణులకు నాణ్యమైన పోషకాహారం అందించాలన్నారు. ఏఎన్ఎం, ఆశాలు ఎప్పటికప్పుడూ గర్భిణుల ఆరోగ్య స్థితిగతులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. వైద్యులు ప్రమాదకర ఆరోగ్య స్థితిలో ఉన్న గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, జిల్లాలో గర్భిణుల, నవజాత శిశువుల మరణాలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ రాజేందర్, వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్, సురేష్, సౌమ్య, రవీందర్ లు ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఇల్లంతకుంటలో కొమురయ్య జయంతి

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని ఇల్లంతకుంట మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య అన్నారు. తెలంగాణ కోసం పోరాడి అమరుడైన తొలివ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచారన్నారు. గురువారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మ్యాకల మల్లేశం, చెలిమిల్ల కనుకయ్య, బైరి బాలయ్య, పరాద మల్లేశం, మ్యాకల ఐలయ్య, ఎగుర్ల శ్యామ్, దత్తు, బైరి మల్లేశం, చుక్క కనుకయ్య, బీరయ్య, చుక్క బాబు, పెద్ది హరీష్, తొత్తల్ల ఐలయ్య, శ్రీశైలం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మహిళలు మృతి





**కలంజ్యోతి, నాగర్ కర్నూలు :** నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలంలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతిచెందారు. వేరుశనగ పొలాల్లో కూలీ పనులకు వెళ్లిన సమయంలో వచ్చిన భారీ వర్షంలో పిడుగు పడడంతో మండలంలోని కండ్లకుంట ప్రాంతానికి చెందిన సుంకరి సైదమ్మ (35), ఈదమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళ సుంకరి లక్ష్మమ్మ గాయపడగా ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# భవిష్యత్తుని ఆగం చేసింది బీఆర్ఎస్ పార్టీ కదా?

## కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్ర రవితేజగౌడ్



**కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల :** కంచె గచ్చిబౌలి భూములపై వివాదం సృష్టించి హెచ్ సీయూ విద్యార్థులను తప్పుదోవ పట్టించి బీఆర్ఎస్, బీజేపీలు పెనంపై రొట్టెలు కాల్చుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రచార కమిటీ కన్వీనర్, టీపీసీసీ లీగల్ సెల్ బాధ్యులు బుర్ర రవితే జ గౌడ్ అన్నారు. గురువారం సిరిసిల్ల విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పర్యావరణం గురించి కేటీఆర్ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు అనిపిస్తుంది. హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని అందించే జంట జలాశయాలను కాపాడే జీవో నెంబర్ 111 నీ ఎత్తివేసి ఎకరానికి రూ.100 కోట్ల చొప్పున వేలం వేసిన సర్కార్ మీది కాదా? జరగబోయే జల కాలుష్యాన్ని నివారించడం సాధ్యమా? భవిష్యత్తు నగరానికి కలుషిత నీరు ఇచ్చి రెండు కోట్ల వరకు ఉండే నగర జనాభా భవిష్యత్తుని ఆగం చేసింది మీరు కాదా? ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మీ నియోజకవర్గంలో విచ్చలవిడిగా గుట్టలు తగ్గుతూ మట్టి మాఫియా చేసిన విధ్వంసానికి అండగా నిలిచింది ఎవరు? అని నిలదీశారు. ప్రజ లు విలేకరులు నెత్తి నోరు మొత్తుకున్న రాత్రింబవళ్లు అడ్డగోలుగా మట్టి తవ్వకాలు చేపట్టింది ఎవరి అనుచరులు? ఎవరి బినామీలో? కేటీఆర్ స్పష్టం చేయాలన్నారు. అగ్రహారం ప్రధాన రోడ్డుకు ఆనుకొని పచ్చగా హరితవనంలో ఉన్న గుట్టని ఎర్రటి తివాచిలా మార్చింది మీరు కాదా! పని కిరాని కాళేశ్వరం బ్యారేజ్ కట్టి మహారాష్ట్ర ఛత్తీస్ గఢ్ బార్డర్ లో ఎంత అడవికి నష్టం చేశారో మీకు తెలియదా? ప్రశ్నించారు. మలకపేట రిజర్వాయర్ నిర్మాణం కోసం ఎన్ని కోట్ల చెట్లు నరికారో మీకు తెలుసు కదా! అని అడిగారు. మూడు విశ్వవిద్యాలో చదువుకున్న వ్యక్తిగా, విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమి కబ్జా గురైతే ఎంత బాధ ఉంటుందో నాకు తెలుసు. కేయూ జేఎన్టీయూ ఓయూలలో గత ప్రభుత్వాలలో ఎకరాల కొద్ది భూమి కబ్జా కాబడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓయూ భూములను లాక్కునే ప్రయత్నం చేసి విఫలమైంది. విద్యార్థులు వ్యతిరేకిస్తున్న బలవంతంగా ఓయుకు సంబంధించిన భూమిలో నుండి రోడ్డు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు హెచ్ సీయూకు సంబంధం లేని భూమినీ ప్రభుత్వం రాష్ట్ర అవసరాల దృష్ట్యా వినియోగించదలిస్తే.. అనవసరంగా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వాట్సాప్ యూనివర్సిటీ, బీఆర్ఎస్ స్టూడియోలలో గ్రాఫిక్ డిజైన్లను తయారుచేసి లేని నెమళ్లను, జింకలను పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమం చేయడం సరైనది కాదన్నారు. 2024 గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ లో తప్పుడు సమాచారం, సరైన సమాచారం ఇవ్వకపోవడం ఫేక్ న్యూస్ సంబంధిత విషయంలో మన దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందన్నారు. నిజానిజాలు ఏంటో నిర్ధారించుకున్నాకే ప్రజలు సోషల్ మీడియా సమా చారాన్ని ఇతరులకు షేర్ చేయాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎండు చూసి గోపాలం పాడుతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని బుర్ర రవితేజగౌడ్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా లీగల్ సెల్ చైర్మన్ ఇరుకుల అశ్విన్, స్పోక్స్ పర్సన్ భగవాన్ రాజేష్, జాయింట్ కన్వీనర్ తిరుపతి సుహాసిని జ్యోతి, రాకేష్, కమలాకర్, విశాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

## ఎస్పీ అశోక్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో, ట్రాఫిక్ నియమాలను మరింత పకడ్బందీగా అమలుచేసేందుకు డీజీపీ కా ర్యాలయం నుంచి వచ్చిన అధునాతన పరికరాలు ఫ్లెక్సబుల్ ఐరన్ బారికేడ్స్, ట్రాఫిక్ కోన్స్, రిఫ్లెక్ట్ జాకెట్స్, బ్రీత్ అనలైసర్స్, ఎల్ఈడీ బటన్స్, బొల్లార్డ్స్, రేడియం టేప్ రోలర్స్, డిజిటల్ వీడియో కెమెరాస్, ఫోల్డెడ్ బారికెట్స్, పరికరాలను ఎస్పీ గురువారం జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో వివిద పోలీస్ స్టేషన్ల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ట్రాఫి క్ నియమాలను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు, రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు అధునాతన ట్రాఫిక్ పరికరాలను అందుబాటులోకి తేవడం జరిగిందనీ అన్నారు. కాలానుగుణంగా పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడానికి, ట్రాఫిక్/పోలీస్ సిబ్బంది ఎఫెక్టివ్ గా విధులు నిర్వహించడానికి ఈ పరికరాలు ఎంతగానో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్ర మంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీలు రఘుచంధర్, రాముల, రంగారెడ్డి, డీసీఆర్బీ, ఎస్బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇన్ స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీఖాన్, శ్రీనివాస్, రిజర్వ్ ఇన్ స్పెక్టర్ కిరణ్ కుమార్, సీపీ, ఎస్సైలు పాల్గొన్నారు.



# రిటైర్డ్ పెన్షనర్ ఉద్యోగుల నిరసన

**కలంజ్యోతి, జగిత్యాల :** కేంద్ర ప్రభుత్వ పెన్షన్ విధానాలకు వ్యతిరేకంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు నిరసన రిటైర్డ్ పెన్షనర్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన 2025 బడ్జెట్ లో ఆమోదించబడిన పెన్షనర్ల సవరణ బిల్లుతో పెన్షనర్లకు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రమాదకరమన్నారు. దాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా నాయకులు చిలుముల గంగారాం, ఎలుగండుల సుధాకర్, పురుషోత్తం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు అల్లం ఆర్థికసాయం

**కలంజ్యోతి, గీసుకొండ :** మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన కొల్లూరి హైమావతి ఇటీవల మృతిచెందింది. విషయం తెలు సుకున్న ప్రజా సేవకులు అల్లం బాలకిషోర్ రెడ్డి మృతిరాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అల్లం మర్రెడ్డి, వీరగని రాజ్ కుమార్, రడం భరత్, కందికొండ రాజకుమార్, మాజీ సర్పంచ్ చాపర్తి కనకయ్య, తోట కమలాకర్, ఇనుముల ప్రభాకర్, చాపర్తి మొగిలి పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఎల్కుర్తి హవేలీ గ్రామానికిచెందిన నిమ్మకాయల శివ, రాయపూరి ఎల్లయ్య, వనపర్తి చంద్రమౌళి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని ప్రజా సేవకులు అల్లం బాలకిషన్ రెడ్డి వారి కుటుంబాలకు రూ.5వేల చొప్పున ప్రతి కుటుంబానికి తమవంతు సాయం అందజేశారు. కార్యక్రమంలో అల్లం మర్రెడ్డి , వీరగాని రాజ్ కుమార్, రాడం భరత్, బొరియ శోభన్ బాబు, గుడిపల్లి ఇంద్రసేనారెడ్డి, ఐలోని జయపాల్ రెడ్డి, గాదం నాగరాజు పాల్గొన్నారు.



# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని జంగంరెడ్డి పల్లె గ్రామంలో రూ.10 లక్షల నిధులతో మంజూరైన నూతన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు మంద పెద్ద బాల్ రెడ్డి, తూముకుంట రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ ఉపాధక్షులు కుమ్మరివేణి తిరుపతి, ప్రధాన కార్యదర్శి పసునూటి రవి, తూముకుంట రఘుపతిరెడ్డి, మల్లారెడ్డి, రమణా రెడ్డి, తిరుపతి రెడ్డి, కుమ్మరివేణి వెంకన్న, పండుగు గణేష్, నూనె రాజయ్య, రాజు, మల్లమారి మల్లేష్, అనిల్, పండుగు వెంకటయ్య, కుమ్మర వేణి యాదగిరి, గొడుగు రామస్వామి, మంకాలి శ్రీనివాస్, తూముకుంట రాజిరెడ్డి, పారిపెల్లి మోహన్ రెడ్డి, మంద సత్తి రెడ్డి, పారిపల్లి బాలకృష్ణ, పారిపల్లి రాంరెడ్డి, వొల్లాలా కనుకయ్య, కుమ్మరివేణి నారాయణ పాల్గొన్నారు.





## నా భర్తకు ఇంట్రెస్ట్ లేదు

నటి అనసూయ భరద్వాజ తన భర్త గురించి తన కుటుంబం గురించి సీక్రెట్స్ బయటకు చెప్పింది. తనకు ఆడబిడ్డ కావాలని... అంటే ఇంట్లో మాత్రం ఎవరూ ఒప్పుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తన భర్తకు అసలు ఏమాత్రం ఇంట్రెస్ట్ లేదని ఆమె చెప్పకనే చెప్పారు. తాజాగా అనసూయ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తన భర్త సుశాంక్ భరద్వాజ్, తన కుటుంబం లో జరిగే విషయాల గురించి రహస్యాలు బయటపెట్టారు. తన ఇంట్లో ముగ్గురు బీహార్ వాళ్లు .. ఉన్నారని... అన్ని మీసాలు గడ్డాలు తప్ప ఆడవాళ్లు మాత్రం లేరన్నారు. ప్రతి ఇంట్లో ఆడపిల్ల ఉండాలని... తనకు కూడా ఆడపిల్ల కావాలని ఉందని తెలిపారు. కానీ ఇంట్లో తన ఆటలు సాగడం లేదని వివరించారు. ఆడపిల్లను కనడం తన చిన్న కొడుకుకు కూడా ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. ఇక తమ ఇంట్లో ఎక్కువ శాతం బిహారీ పద్ధతులు కొనసాగుతాయని ఆమె వివరించారు. ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు తమ లైఫ్ ఫుల్ బిజీగా ఉంటుందని ఆమె చెప్పారు. అనసూయ చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి.